

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 19-05-2026 | సంపుటి - 27 | సంచిక -356 | రూ : 4 | పేజీలు: 8




## ఏది సర్..
# ఏది జనగణన?

- వివరాల సేకరణలో గందరగోళం పాక్షిక వివరాలే చెప్తున్న జనం ఎన్యూమరేటర్లకు ఇబ్బందులు
- క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ లోపాలు.. కొరవడిన ప్రజల సహకారం

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన రాష్ట్రంలో మొదలైంది. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ఏర్పాట్లు కూడా జరగుతుండటంతో ప్రజల్లో గందరగోళం నెలకొంటోంది. ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి ఆశించిన మద్దతు లభించట్లేదు. జనగణన, సర్ రెండూ తరువాయి 2లో

## బక్రీద్ ఎఫెక్ట్
# ఓయూ డిగ్రీ పరీక్షల రీషెడ్యూల్

- బక్రీద్ పండుగ కారణంగా మే 28న ఓయూ పరీక్షలు రీషెడ్యూల్
- పరీక్షలను రీషెడ్యూల్ చేస్తామని స్పష్టం చేసిన వైస్ ఛాన్సలర్
- పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వానికి ఎంపీ ఒవైసీ విజ్ఞప్తి


2లో



# మెట్రో రద్దీకి త్వరలోనే పరిష్కారం!

- హైదరాబాద్ మెట్రోకు 60 కొత్త కోచ్‌లు
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం
- బెంగళూరు బీఈఎంఎల్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం
- 15 నెలల్లో కోచ్‌ల సరఫరాకు సంస్థ హామీ
- పెరగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు ఊరట

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరువాయి 2లో



# కేరళం సీఎం ప్రమాణ స్వీకారం


- 20 మంది మంత్రులు కూడా..ఖర్గే, రాహుల్, రేవంత్ హాజరు
- కేరళంలో కొలువుదీరిన యూడీఎఫ్ ప్రభుత్వం

తిరువనంతపురం: కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్ సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. అయితే సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వచ్చారు. కర్నాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ హాజరయ్యారు.

### 20 మంది మంత్రులు ప్రమాణం

సతీశన్తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం తరువాయి 2లో

## భారత్, నార్వే మధ్య
# వ్యూహాత్మక భాగస్వామ్యం



- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే అండగా నిలిచింది: ప్రధాని మోడీ
- ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు 2లో




## భద్రతా సమస్యల నుంచి
# దేశానికి విముక్తి!

- రాష్ట్ర పోలీసు అధికారులకు సన్మానం

హైదరాబాద్, జగ్‌దల్‌పుర్: దేశంలో ప్రధాన అంతర్గత భద్రతా సమస్యలైన నక్సలిజం, జమ్మూకశ్మీర్ తీవ్రవాదం, ఈశాన్యంలో తిరుగుబాటు దాదాపుగా అంతరించి పోయాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. గతంలో మావోయిస్టులకు పెట్టనికోటగా ఉన్న బస్తర్ ప్రాంతంలోని జగ్‌దల్‌పుర్‌లో జరిగిన ఒక తరువాయి 2లో

# 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ!

- ఎకరా ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షల నుంచి రూ.2.75 లక్షలకు
- ఓఆర్ఆర్ లోపల కనిష్ఠంగా రూ.15 లక్షలు
- అపార్టుమెంట్లలో చదరపు అడుగు రూ.6 వేలు
- ఈ నెల 28 నుంచే అమలుకు సన్నాహాలు




తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూముల ప్రభుత్వ విలువను మూడు రకాలుగా సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ, ప్రధాన రహదారులు, మండల కేంద్రాలు, పట్టణాలకు సమీపంలోని భూముల విలువను సవరించనున్నారు. బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) లోపల ప్రాంతాల్లో బహిరంగ ధరలకు, మార్కెట్ విలువకు అంతరం తరువాయి 2లో

# ఇరిగేషన్ క్యాలెండర్‌లో మరో 11 ప్రాజెక్టులు!

- ఇరిగేషన్ క్యాలెండర్‌కు కొత్తగా 11 ప్రాజెక్టులను చేర్చిన ప్రభుత్వం
- మొత్తం 36 ప్రాజెక్టుల పనులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి చేయాలని ఆదేశం
- వెలిగొండ, హంద్రీనీవా పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- ఖరీఫ్ సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీరివ్వాలని సూచన

2లో



# మెట్రో రద్దీకి త్వరలోనే పరిష్కారం!

హైదరాబాద్: నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ మియాపూర్, నాగోల్ రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో బీఈఎంఎల్‌కు ఆర్డర్ ఇచ్చే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2015లో సుమారు రూ.1800 కోట్లతో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ రొటెమ్ సంస్థ నుంచి మెట్రో కోచ్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు కొత్త కోచ్‌ల తయారీ కోసం హ్యుందాయ్ తమ సాంకేతికతను బీఈఎంఎల్‌కు బదిలీ చేసేందుకు అంగీకరించింది. దేశంలోని అనేక మెట్రో ప్రాజెక్టులకు విజయవంతంగా కోచ్‌లను సరఫరా చేసిన అనుభవం బీఈఎంఎల్‌కు ఉంది. ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే, రద్దీ మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో పాటు ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఫలితంగా మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సుఖవంతంగా మారనుంది.

## బక్రీద్ ఎఫెక్ట్: ఓయూ డిగ్రీ పరీక్షల రీషెడ్యూల్

హైదరాబాద్: బక్రీద్ (ఈద్ ఉల్ అధా) పండుగను పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. మే 28వ తేదీన నిర్వహించ తలపెట్టిన పలు డిగ్రీ కోర్సుల పరీక్షలను రీషెడ్యూల్ చేయనున్నట్లు ప్రకటించింది. పండుగ తేదీపై స్పష్టత రావడంతో విద్యార్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయానికి ఒకరోజు ముందు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. బక్రీద్ పండుగ రోజే బీఏ, బీకాం, బీఎస్సీ వంటి పలు ముఖ్యమైన పరీక్షలను షెడ్యూల్ చేశారని, దీనివల్ల ముస్లిం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆయన తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. బీకాం 4వ, 6వ సెమిస్టర్, బీఎస్సీ ఆనర్స్, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ సహా పలు పరీక్షల జాబితాను ప్రస్తావిస్తూ, వాటిని అనువైన మరో తేదీకి మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఓవైసీ విజ్ఞప్తి, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురాం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సెలవుల ప్రకారం మే 27న ఎలాంటి పరీక్షలు షెడ్యూల్ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ బక్రీద్ తేదీలో మార్పు ఉంటే, దానికి అనుగుణంగా మే 28న జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూల్ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పరీక్షల తేదీలకు సంబంధించిన తదుపరి అప్‌డేట్స్ కోసం విద్యార్థులు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్ (osmania.ac.in)ను గమనించాలని సూచించారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన ధుల్ హిజ్జాకు సంబంధించిన చంద్రుడు ఆదివారం (మే 17) కనిపించకపోవడంతో ఇస్లామిక్ పండితులతో కూడిన మూన్ సైటింగ్ కమిటీ మే 19ని ధుల్‌హిజ్జా మొదటి రోజుగా ప్రకటించింది. దీని ప్రకారం, ధుల్‌హిజ్జా 10వ రోజైన బక్రీద్ పండుగ మే 28న వస్తుందని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కూడా తన అధికారిక సెలవుల జాబితాను సవరించి, మే 28ని బక్రీద్ పండుగకు సెలవుగా ప్రకటించనుంది. యూనివర్సిటీ త్వరలోనే వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలను ప్రకటించనుంది.

## ఏది సర్..ఏది జనగణన?

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన రాష్ట్రంలో మొదలైంది. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ఏర్పాట్లు కూడా జరుగుతుండటంతో ప్రజల్లో గందరగోళం నెలకొంటోంది. ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి ఆశించిన మద్దతు లభించట్లేదు. జనగణన, సర్ రెండూ వేర్వేరు అనీ, ఆ రెండింటిని విడివిడిగా నిర్వహిస్తున్నామని ప్రజల్లో అవగాహన కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం విఫలమైనట్లు తెలుస్తోంది. ఈ గందరగోళం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నదని ఎన్యూమరేటర్లు మొత్తుకుంటున్నారు.

### మ్యాచ్ కాని మ్యాపింగ్

కేవలం ప్రభుత్వ ఉద్యోగులనే ఏకైక కారణంతో జనగణనలో స్కావెంజర్లు, అటెండర్లు, స్వీపర్లకు కూడా ఇంటింటి సర్వే డ్యూటీలు వేశారు. వీరికి మ్యాపింగ్ ఎలా చేయాలో అర్థంకాక నానా అవస్థలు పడుతున్నారు. ఇదే విషయంపై ఇటీవలే మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ జనగణన ఉన్నతాధికారులకు వినతిపత్రం కూడా సమర్పించారు. జనగణన సక్రమంగా జరగట్లేదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

### పంచాయతీల్లోనూ పరేషానే

కొత్త గ్రామ పంచాయతీలు, ఇటీవల ఏర్పడిన మున్సిపల్ వార్డుల్లో మారిన హౌస్ నంబర్లు అధికారిక రికార్డుల్లో పూర్తిగా అప్‌డేట్ కాకపోవడంతో ఎన్యూమరేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పాత మ్యాపులు, కొత్త నిర్మాణాల మధ్య వ్యత్యాసం ఉండటంతో ఇళ్ల లెక్కింపులో పొరపాట్లు చోటుచేసుకుంటున్నాయని అధికారులు అంగీకరిస్తున్నారు.

### నగరాల్లో...

నగరాల్లో అనధికార నిర్మాణాలు, బస్తీల విస్తరణ, రహదారి మార్పులు వంటి అంశాలు డిజిటల్ మ్యాపింగ్‌ను మరింత క్లిష్టం చేస్తున్నాయి. జనగణనలో ఆయా కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, వలసలు, గృహ వసతులు వంటి వివరాలను సేకరించాల్సి ఉంటుంది. అయితే పట్టణ ప్రాంతాల్లో ఒకే చిరునామాలో బహుళ కుటుంబాలు నివసిస్తుండటం, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ నంబర్లు స్పష్టంగా లేకపోవడం, అద్దెదారులు తరచూ మారిపోవడం వంటి అంశాలు సర్వేను క్లిష్టతరం చేస్తున్నాయి.

### వివరాలు చెప్పేందుకు అనాసక్తి

కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తమ వివరాలు ఇవ్వడానికి నిరాకరిస్తుండటం ఎన్యూమరేటర్లకు తలనొప్పిగా మారింది. ప్రధానంగా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అవుతుందనే అనుమానంతో అనేకమంది ఆధార్, ఫోన్ నంబర్, ఉద్యోగ వివరాలు వంటివి చెప్పేందుకు తిరస్కరిస్తున్నారు. దీనితో సర్వేకు అదనపు సమయం పడుతున్నదని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు.

## కేరళం సీఎం ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

### 20 మంది మంత్రులు ప్రమాణం

సతీశన్తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం యూడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, కే మురళీధరన్, ఎపీ అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హాల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కేఎం షాజీ, పీకే బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళం ముఖ్యమంత్రి ఎవరనే దానిపై 11 రోజులపాటు ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొన్నా..కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ప్రకటించింది.

### న్యాయవాది టు సీఎం

కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది. పదేండ్లు కేరళం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళం విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేండ్లుగా కేరళం అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.కేరళం ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేండ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు.

## భద్రతా సమస్యల నుంచి దేశానికి విముక్తి!

హైదరాబాద్, జగ్‌దల్‌పుర్: దేశంలో ప్రధాన అంతర్గత భద్రతా సమస్యలైన నక్సలిజం, జమ్మూకశ్మీర్ తీవ్రవాదం, ఈశాన్యంలో తిరుగుబాటు దాదాపుగా అంతరించి పోయాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. గతంలో మావోయిస్టులకు పెట్టనికోటగా ఉన్న బస్తర్ ప్రాంతంలోని జగ్‌దల్‌పుర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కచ్చితమైన ప్రణాళికతో ఛత్తీస్‌గఢ్‌ను నక్సల్‌రహిత రాష్ట్రంగా మార్చామన్నారు. ఈ సందర్భంగా వామపక్ష తీవ్రవాదంపై పోరాటం చేసిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ, రాష్ట్ర భద్రతా సలహాదారు బి.శివధర్‌రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ అనిల్‌కుమార్, ఎస్ఐబీ మాజీ ఐజీ, ప్రస్తుత మల్కాజిగిరి కమిషనర్ సుమతి తదితరులను అమిత్‌షా సన్మానించారు. అనంతరం డీజీపీతోపాటు నక్సలిజాన్ని అణచివేయడంలో కీలకపాత్ర పోషించారని శివధర్‌రెడ్డి, సుమతిలను హోంమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. మావోయిస్టులతో పోరులో ప్రాణాలు కోల్పోయిన వెయ్యి మందికి పైగా భద్రతా సిబ్బందికి ఆయన అమర్ వాటికాలో నివాళులు అర్పించారు.

## భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

ఓస్లో: అత్యంత క్లిష్టసమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, భారతదేశానికి, నార్వే అండగా నిలిచి, తన నిజమైన స్నేహాన్ని చాటుకుందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. సోమవారం నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన తరువాత, ప్రధాని మోడీ పలు కీలక అంశాలపై మాట్లాడారు. సైనిక ఘర్షణల ద్వారా మాత్రమే శాశ్వత శాంతిని సాధించలేమని ప్రధాని మోడీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని, ఉక్రెయిన్ వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు."భారత్, నార్వే రెండూ కూడా నియమ, నిబంధనలతో కూడిన ప్రపంచ వ్యవస్థను, చర్చలను, దౌత్యాన్ని విశ్వసిస్తాయి. కేవలం సైనిక ఘర్షణ ద్వారా మాత్రమే ఏ సమస్యనూ పరిష్కరించలేమని మేము ఇద్దరం భావిస్తున్నాం. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలు వీలైనంత త్వరగా ముగియడానికి, శాంతి స్థాపన కోసం జరిగే ప్రతి ప్రయత్నానికి మేము మా మద్దతును ఇస్తాం." అని మోడీ చెప్పారు.

### అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలి

నాలుగు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా స్వీడన్ నుంచి నార్వే రాజధాని ఓస్లో చేరుకున్న కొద్ది గంటల్లోనే మోడీ, ఆ దేశ ప్రధాని స్టోర్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం. ఈ విషయంలో నేను, నార్వే ప్రధాని ఏకాభిప్రాయంతో ఉన్నాం. అంతేకాదు ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ సమూలంగా నిర్మూలించడం మన ఉమ్మడి బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు.

### నిజమైన స్నేహం

గతేడాది పహల్గాంలో హిందూ పురుషులే లక్ష్యంగా జరిగిన పాక్ ప్రేరిపిత ఉగ్రదాడిలో, భారత్కు చెందిన 26 మంది పౌరులు మరణించారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని మోడీ, ఆ క్లిష్ట సమయంలో భారత్కు నార్వే అందించిన మద్దతును కొనియాడారు. "నేను గత ఏడాదే నార్వేలో పర్యటించాల్సి ఉంది. కానీ పహల్గాం ఉగ్రదాడి కారణంగా ఆ పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే, భారతదేశానికి అండగా నిలబడి, నిజమైన స్నేహాన్ని చాటుకుంది. ఈ రోజు నేను నార్వేను సందర్శిస్తున్న తరుణంలో, వారు చూపిన సంఘీభావానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను." అని మోడీ తెలిపారు.

* **ఇంజినీరింగ్ విభాగాల్లో కీలక ఒప్పందాలు**

ఇటీవల భారత్, ఈయూ మధ్య చారిత్రక ఒప్పందం జరిగిందని, దీని వల్ల భారత్, నార్వేలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయన అన్నారు. "భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. నార్వే నుంచి సాంకేతికత, పెట్టుబడులు భారత్కు వస్తున్నాయి. అలాగే వివిధ రంగాల్లో పరిశోధనల కోసం నార్వే నుంచి మేము సాయం తీసుకుంటాం. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయి. ఇస్రో, నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక ఇరుదేశాల మధ్య ఉన్న గ్రీన్ స్ట్రేటజీ వల్ల ప్రపంచ దేశాలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మారిటైమ్ భద్రత విషయంలోనూ మేము నార్వేతో కలిసి పనిచేస్తున్నాం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## ఇరిగేషన్ క్యాలెండర్‌లో మరో 11 ప్రాజెక్టులు!

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్‌కు అదనంగా మరో 11 ప్రాజెక్టులను చేర్చి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ క్యాలెండర్‌లోని మొత్తం ప్రాజెక్టుల సంఖ్య 36కు చేరింది. సోమవారం సచివాలయంలో జలవనరుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో 25 ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్‌ను ప్రకటించిన సీఎం, తాజా సమీక్షలో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ 36 ప్రాజెక్టుల పనులను క్యాలెండర్ ప్రకారం పూర్తి చేయాలని, భూసేకరణ, నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులకు సూచించారు.

* **పోలవరం, ఇతర ప్రాజెక్టులపై సీఎం ఆదేశాలు**

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులను 2027 మార్చి 31 నాటికి, నిర్వాసితుల తరలింపును 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం స్పిల్ వే వద్ద పర్యాటక ఆకర్షణగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేయాలని, హంద్రీనీవా కాలువ ద్వారా ఈ ఏడాదే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటిని విడుదల చేయాలని, జలధారజలహారతి కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ!

తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూముల ప్రభుత్వ విలువను మూడు రకాలుగా సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ, ప్రధాన రహదారులు, మండల కేంద్రాలు, పట్టణాలకు సమీపంలోని భూముల విలువను సవరించనున్నారు. బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్) లోపల ప్రాంతాల్లో బహిరంగ ధరలకు, మార్కెట్ విలువకు అంతరం భారీగా ఉంది. దీంతో స్థానిక పరిస్థితులను బట్టి మార్కెట్ విలువను సవరించాలని అంచనాకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వచ్చినట్లు తెలిసింది. మొత్తంగా సాగు, సాగేతర, స్థిరాస్తుల విలువ 50% వరకు సవరించనున్నట్లు తెలిసింది. ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమల్లోకి తీసుకురావాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించినట్లు సమాచారం. కొద్దిరోజులుగా ఈ విషయంపై శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు యంత్రాంగంతో కసరత్తు చేస్తున్నారు. సోమవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలపై ఒకేసారి ఎక్కువ మొత్తం భారంపడకుండా అమల్లోకి తేవాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకోవాలనే అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు సవరించనున్న అంచనాల వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎకరా ప్రభుత్వ మార్కెట్ విలువ కనిష్ఠంగా రూ.1.75 లక్షలు ఉండగా రూ.2.75 లక్షలకు సవరించనున్నారు. ఓఆర్ఆర్ లోపల ఎకరా ప్రభుత్వ విలువ రూ.8.75 లక్షలు ఉండగా కనిష్ఠంగా రూ.15 లక్షలకు సవరించాలని నిర్ణయించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాల్లో భూముల ధర బహిరంగ మార్కెట్లో భారీగా ఉంది. వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లో ఎకరా రూ.7080 కోట్లు పలుకుతోంది. మరికొన్నిచోట్ల రూ.150 కోట్లు కూడా ఉంది. ప్రభుత్వ విలువ రూ.22.5 కోట్ల వరకే ఉంది. దీనిని రూ.4 కోట్లు చేయనున్నారు.

* **అపార్ట్‌మెంట్ల చ.అడుగు విలువ రూ.6 వేలకు**

రాష్ట్రంలో అపార్ట్‌మెంట్ల బహిరంగ ధరలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ల మార్కెట్ విలువను ప్రభుత్వం సవరించనుంది. ఈ క్రమంలో ఫ్లాట్ల చ.అడుగు విలువ 75% వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3,500 నుంచి రూ.4 వేలు ఉన్నచోట దాదాపు రూ.6 వేలకు పెంచనుంది.

### అదనంగా రూ.1,500 కోట్ల రాబడి

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రాబడి ప్రస్తుతం రూ.15 వేల కోట్ల వరకు ఉంది. అధికంగా హైదరాబాద్ నగర శివార్లలోని భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు, అపార్ట్‌మెంట్లు, హైరైజ్డ్ భవనాలు, విల్లాల రిజిస్ట్రేషన్ల ద్వారా వస్తోంది. అయినప్పటికీ బహిరంగ ధరలకు, ప్రభుత్వ విలువకు మధ్య పెద్దఎత్తున అంతరం ఉంది.

## రేవంత్ రెడ్డి బీజేపీలో చేరొచ్చు
## ఎంపీ అరవింద్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరే అవకాశం ఉందేమోనని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ప్రధాని మోదీ 'రేవంత్ గారూ.. నాతో కలవండి' అని చేసిన వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఇదే కావచ్చని ఆయన జోస్యం చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారిలాగే రేవంత్ కూడా పార్టీ మారొచ్చని ఆయన ఆసక్తికర విశ్లేషణ చేశారు. సోమవారం నిజామాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరవింద్ మాట్లాడారు. ''ప్రధాని మోదీ, రేవంత్‌ల మధ్య ఏదైనా సంబంధం ఉందేమో నాకు తెలియదు. నేను బీజేపీలో ఒక సామాన్య కార్యకర్తను మాత్రమే'' అని ఆయన అన్నారు. టీడీపీ నుంచి వచ్చిన రేవంత్‌కు సీఎం పదవి ఇచ్చి, కాంగ్రెస్ అధిష్ఠానం సొంత పార్టీ సీనియర్లను మోసం చేసిందని అరవింద్ ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు లాంటి వారికి సీఎం పదవి ఇచ్చి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

# టూరిజం రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

*** యువ టూరిజం క్లబ్ పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ అంకిత్**



సందర్భంగా "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ తన కార్యాలయంలో

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుండి ఈనెల 23 వరకు నిర్వహించనున్న టూరిజం వారోత్సవాల సందర్భంగా "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తి పెంచడంతోపాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. టూరిజం వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద, 20న లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ రాక్ కేవ్స్ వద్ద హెరిటేజ్ వాక్, 21న జిల్లాలోని యూట్యూబర్లతో సమావేశం, 22న బౌద్ధ రాక్ కేవ్స్ ప్రాంతంలో స్వచ్ఛత డ్రైవ్, 23న పాల్వంచలోని ఐడాక్‌లో బ్రాండ్ కిట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజియాలజీ, ఆర్కియాలజీ సర్టిఫికెట్ కోర్సులను యువత వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కోర్సుల ద్వారా పర్యాటక, పురావస్తు, మ్యూజియం రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజును సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం.. కాంగ్రెస్ తోనే సాధ్యం

*** కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**
*** ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన పిసాటి అనూష, ఊదరి మధురిమలకు మంజూరైన రూ.1,01,116ల విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను సర్పంచ్ జువ్వి నర్సింహ్మా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేసిందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ భార్గవ్, ఐతరాజు లింగస్వామి, బద్రి లింగయ్య, ఊదరి రవి, వల్లబోతు నరేష్ లబ్ధిదారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సహకార బ్యాంక్ అప్రైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా గంగాధర్




ప్రజాస్ఫూర్తి , జన్నారం : తెలంగాణ రాష్ట్ర డిసిసి సహకార బ్యాంక్ అప్రైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జన్నారం మండల కేంద్రానికి చెందిన శ్రీరాముల గంగాధర్ ను నియమిస్తూ ఆల్ బ్యాంక్ అప్రైజర్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, సెక్రటరీ రాఘవాచారి ల చేతుల మీదుగా హైదరాబాద్ పోటీలో ఉన్న బీసీ సాధికారిక సంస్థ బీసీ భవన్లో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా శివకుమార్, కోశాధికారిగా ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కృష్ణమాచారి, ఆంజనేయులు లను నియమించారు. ఈ సందర్భంగా శ్రీరాముల గంగాధర్ మాట్లాడుతూ డిసిసి బ్యాంక్ అప్రైజర్ల రాష్ట్ర అధ్యక్షుడుగా నన్ను నియమించినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, అప్రైజర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని అఖిల భారత విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం సన్మానించారు.

## యువ టూరిజం క్లబ్స్ పోస్టర్ ఆవిష్కరణ

*** ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల నేపథ్యంలో పర్యాటకశాఖ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా... సోమవారం కలెక్టరెట్ లోని సమావేశ మందిరంలో 99 రోజుల కార్యచరణ ప్రణాళికను, యువ టూరిజం క్లబ్స్ కార్యచరణ పైన రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగామే 18 నుండి 23 వరకు పర్యాటక వారోత్సవాలను టూరిజం వీక్ నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమం లో జెడ్పి సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనంజనేయులు , డి పి ఆర్ ఓ అరుంధతి, హౌసింగ్ పీడీ అలివేలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 51 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. వచ్చిన ఆర్జీలలో రెవిన్యూ శాఖ 32,హౌసింగ్ 5, జిల్లా సంక్షేమ శాఖ 3, మున్సిపాలిటీ 2, సర్వే ల్యాండ్ 2, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ , ఎక్సైజ్, ఇరిగేషన్, చేనేత జౌళి,జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. స్టేట్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ లను బీసీఏ లో చేర్చవద్దనే గంగపుత్రుల డిమాండ్ ను ఖండిస్తున్నాం

**: దేప శ్యాంసుందర్ ముదిరాజ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ముదిరాజ్ కులస్తులను బిసిఏ లో చేర్చవద్దు అని గంగపుత్ర సంఘం చేసిన ప్రకటనను ఖండిస్తున్నామని ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు దేప శ్యాం సుందర్ ముదిరాజ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో ముదిరాజ్ మహాసభ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేప శ్యాం సుందర్ ముదిరాజ్ విలేకరులతో మాట్లాడారు. ముదిరాజులను బిసిఏ లో చేర్చడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను చూసి ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జనాభాలో ముదిరాజులే అత్యధికంగా ఉన్నారని స్పష్టమైందన్నారు. మేము కొత్తగా ఏమీ అడగడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టోనే అమలు చేయాలంటున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డిని ముదిరాజ్ ఐక్య సంఘాలు కలిసి అడగగా, సానుకూలంగా స్పందించి,ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. ముదిరాజులను బీసీఏ మార్చే దిశగా అడుగులు పడుతున్న తరుణంలో గంగపుత్రులు ఇలా సమావేశాలు, ప్రెస్ మీట్ లు పెట్టడం, ప్రకటనలు సరికాదని సూచించారు. మీకు కావలసిన హక్కులను మీరు అడగవచ్చని కానీ, మేము అడిగే హక్కులను హరించవద్దన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవద్దని గంగపుత్రులకు సూచించారు. ముదిరాజులు చేస్తున్న పోరాటంలో అన్ని ముదిరాజ్ సంఘాలు పాల్గొని ఐక్య ఉద్యమాలు చేసి ఇలాంటి ప్రకటనలను ఖండించాలని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ నాయకులు దేప మత్స్యగిరి, గుండ్ల లింగస్వామి, సత్యబోయిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న చెరువు–చర్యలు తీసుకోవాలని వినతి




ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ శివారు గల సర్వేనెంబర్ 374 లో ఉన్న ఊర చెరువును కబ్జా చేసుకుని అక్రమంగా ఇల్లులు నిర్మిస్తున్నారని, అంతేకాకుండా కొందరు నకిలీ పత్రాలు సృష్టించి భూమి అమ్ముకుంటున్నారని కావున ఊర చెరువును కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలకల్ గ్రామానికి చెందిన కొందరు సోమవారం రోజున మండల తహసిల్దార్ బక్కయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబ్జాకు గురైన ఊర చెరువులో పూడిక తీసి చెరును పునరుద్ధించాలని,అలా చేయడం వల్ల చుట్టుపక్కల గల బావులలో నీరు ఇంకా కుండా ఉంటుందని అన్నారు. కబ్జాకు గురైన ఊర చెరువు తహసిల్దార్ కార్యాలయానికి కొద్ది దూరంలో ఉన్నప్పటికీ అధికారులు ఎవరు కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గతంలో ఈ సర్వే నెంబర్ లో వృద్ధులకు కేటాయించిన భూమిని కూడా దళారులు అమ్ముకొని అట్టి స్థలంలో షెడ్లు కూడా వేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా కబ్జాకు గురైన ఊర చెరువును కాపాడి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.వినతి పత్రం అందచేసిన వారిలో కైలాసం, ప్రభాకర్, రాజన్న, శ్రీను తదితరులు ఉన్నారు.

## నామాలపాడు చెక్‌పోస్ట్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ శబరీష్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణా నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన బయ్యారం మండలం, నామాలపాడు చెక్‌పోస్ట్ ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీ విధానం, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో మాట్లాడిన ఎస్పీ, అక్రమంగా పశువుల తరలింపును పూర్తిగా అడ్డుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా రేడియం జాకెట్లు ధరించాలని, టార్చ్ లైట్లు, బ్యారికేడ్లు, కమ్యూనికేషన్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా సమన్వయంతో పనిచేయాలని, స్థానిక పోలీస్ స్టేషన్‌లతో నిరంతరం సమాచారం పంచుకోవాలని తెలిపారు. పశువుల రవాణాకు సంబంధించిన సరైన పత్రాలు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరగేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

## ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

**– స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి శ్రీరామ్‌తో కలిసి స్వీకరించి సమగ్రంగా పరిశీలించారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. టేకులపల్లి మండలం కొత్త తండాకు చెందిన బానోతు రాము స్వామి నాయక్ తన భూ సమస్య పరిష్కరించాలని, కొత్తగూడెం సఫాయి బస్తీకి చెందిన షేక్ సఫియా ఇందిరమ్మ ఇల్లు కోసం, పాల్వంచ వెంకటరావు కాలనీకి చెందిన అజ్మీర కృష్ణ తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు కల్పించాలని, జూలూరుపాడు మండలం కొత్తూరు గ్రామపంచాయతీకి చెందిన భురం వెంకటేశ్వర్లు బోరు వేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష పదవికి ఆరుగురు అభ్యర్థులు పోటి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష పదవికి 17వ తేదిన 11 మంది అభ్యర్థులు నామినేషన్లు చేశారని, వారిలో ఐదుగురు 18 వ తేది సోమవారం నాడు నామినేషన్ లను ఉపసంహరణ చేసుకున్నారని ఎన్నికల అదికారి గుండా రమేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభ్యర్థులు రాచకొండ శ్రీనివాస్, బిక్కుమల్ల కృష్ణ మూర్తి, వుప్పలంచు కృష్ణ, వెంపటి పురుషోత్తం, మనసాని నాగేశ్వరరావు లు వారి నామినేషన్లు ఉపసంహరించుకున్నారని అన్నారు. ఆరుగురు అభ్యర్థులు పోటిలో వున్నారని తెలిపారు. అద్యక్ష పదవికి పోటిలో వున్న అభ్యర్థులు: బెలిదె శ్రీనివాసులు, కలకోట లక్ష్మయ్య, బిక్కుమల్ల ఉపేందర్, కుక్కడపు శ్రీనివాస్, మీలా వంశి, మిట్టపల్లి రమేష్ లు మే నెల 31 వ తేదిన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

## కోమల్లలో విషాదం.. రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి




జనగామ/రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : జనగామ జిల్లా రఘునాథ పల్లి మండలం కోమల్ల గ్రామ సమీపం లోని వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు విషాదాన్ని మిగిల్చాయి. ఒక ప్రమాదం లో తండ్రి, కొడుకు మృతి చెందగా, మరో ప్రమాదం లో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కోమల్ల గ్రామానికి చెందిన హలవత్ బాలాజీ (50), ఆయన కుమారుడు నరేష్ (24) టీవీఎస్ ఎక్సెల్ వాహనం పై వెళ్తుండగా గోవర్ధనగిరి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీ అక్కడి కక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నరేష్ చికిత్స పొం దుతూ మృతి చెందినట్లు సమాచారం. నరేష్ బీటెక్ విద్యార్థి అని తెలిసింది. రెండో ది కోమల్ల యూటర్న్ రోడ్డు పై మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. సమా చారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించా రు . కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తండ్రి, కొడుకు మృతి చెందడంతో కోమల్ల గ్రామం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మునుగ టీ ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ (మహిళలు) వారు తయారు చేసిన మునుగ టీ ని సోమవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు వారు చేసిన టీ ఉత్పత్తుల గురించి తెలుకొని ఇలాంటి కొత్త తరహా ఆలోచలనతో ముందుకి సాగుతూ వారి జీవన ప్రమాణాలని మెరుగుపర్చుకోవాలని దానికి ప్రభుత్వం తరుపున సహకారం కూడా ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా అధికారులు నాగిరెడ్డి, రమణా రెడ్డి, మాధవి, జిల్లా అధికారులు ప్రాసెసింగ్ యూనిట్ సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సహృదయ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించిన మాధవి లత



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు వారి సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి మాధవి లత రాయగిరిలోని సహృదయ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సోమవారం సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వయోవృద్ధులను ముఖాముఖి జరిపి ఆశ్రమంలో వారికి కల్పిస్తున్న వసతుల గురించి సమీక్షించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వయోవృద్ధులకు ఆశ్రమము ముందు స్థలంలో సరైన నీడకై షెడ్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచనలు చేసారు. తదుపరి భువనగిరిలోని గ్రేస్ బాలల హోం ను సందర్శించి, ఈ వేసవి సెలవులలో బాలలకు వివిధ స్కిల్స్ లలో శిక్షణ ఇప్పించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# విజ్ఞానం - నైపుణ్యంతో మాదిగలు విద్యా , ఉద్యోగాల్లో రాణించాలి

* **ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా.గోవిందు నరేష్ మాదిగ**




ప్రజాస్ఫూర్తి , నల్గొండ : మాదిగ విద్యార్థులు నిరుద్యోగులు శాస్త్రీయమైన విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నైపుణ్యాన్ని అభివృద్ధి పరచుకొని ఎస్సీ వర్గీకరణ ద్వారా విద్య ఉద్యోగాలలో నియమకాలలో సంపూర్ణంగా రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా.గోవిందు నరేష్ మాదిగ అన్నారు. నల్గొండ జిల్లా టీఎన్జీవోఎస్ భవన్ లో ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత 7 దశాబ్దాలుగా ఎస్సీలలో ఉమ్మడి రిజర్వేషన్ విధానం కొనసాగడం వలన మాదిగలు విద్యా ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోవడం జరిగింది అని అన్నారు. నేడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ద్వారా 9% రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయని అన్నారు. వర్గీకరణ వల్ల వస్తున్న రిజర్వేషన్ ఫలాలను సద్వినియోగం చేసుకునే విధంగా మాదిగ నిరుద్యోగులు, విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, విజ్ఞానాన్ని రోజురోజుకు అభివృద్ధి పరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విధమైన అవగాహనను ప్రతి గ్రామంలో ఉన్న విద్యార్థులకు, నిరుద్యోగులకు తెలియజేసే విధంగా 40 రోజుల పాటు గ్రామ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలలో విద్యాపరమైన విషయాలను తెలియచెప్తూనే మరోవైపు ఎమ్మార్పీఎస్ ఉద్యమం మీద సంపూర్ణమైన అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో ఉద్యమాన్ని పునర్నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు.జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలను నిర్మాణం చేసుకొని పెద్ద ఎత్తున జెండావిష్కరణలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23 న నల్లగొండ జిల్లా ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పీ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షత వహించగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ , ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరసాని గోపాల్ మాదిగ , నియోజకవర్గ ఇన్చార్జ్ బొజ్జ దేవయ్య మాదిగ , ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు మాదిగ , ఎంఎంఎస్ అధ్యక్షురాలు కురపాటి కమలమ్మ మాదిగ , ఎంఎస్పీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లగంటి రమేష్ మాదిగ , జిల్లా కార్యదర్శి వంగూరి ప్రసాద్ మాదిగ , ఏర్పుల వెంకటయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ చండూరు మండల అధ్యక్షుడు ఆకారపు యేసు మాదిగ , ఎమ్మార్పీఎస్ చిట్యాల మండలం ప్రధాన కార్యదర్శి కావలి కృష్ణ మాదిగ , ఎమ్మార్పీఎస్ మిర్యాలగూడ మండల నాయకులు శ్రీను, శరత్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన బడి' పెండింగ్ బిల్లులు చెల్లించండి

* **ప్రజావాణిలో కలెక్టర్ కు కాంట్రాక్టర్లు వినతిపత్రం అందజేత**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలకు చెందిన కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ ఎం సి చైర్మన్లు సర్పంచ్‌లు ఎంపిటిసి లు జిల్లా కలెక్టర్‌కు పెండింగ్ బిల్లుల కోసం వినతిపత్రం సమర్పించారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచేందుకు 'మన ఊరుమన బడి' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టర్లు, విద్యా కమిటీ చైర్మన్లు డబ్బులు అప్పుగా తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశారు. గత ప్రభుత్వం 6 నెలల పాటు బిల్లులు చెల్లించలేదు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కూడా 25 నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు. కాంట్రాక్టర్లు ఉన్న భూములను, నగలను అమ్మి పనులు పూర్తి చేశారు. వడ్డీలకు అప్పులు తెచ్చి రెండింతలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి బిల్లులు చెల్లించని పక్షంలో తాము అభివృద్ధి చేసిన పాఠశాలలకు తాళాలు వేసి తిరిగి ప్రారంభం కాకుండా చేస్తామని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి అసెంబ్లీని ముట్టడిస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ వినతి పత్రం సమర్పణలో గునుకుల మాధవ్ రెడ్డి జనగామ శ్రీనివాసరావు. ఎం. సంపత్ రావు కె. మధుసూదన్ రెడ్డి పొన్నబోయిన శ్రీనివాస్ కర్ర మనోహర్ కే.రామచంద్రారెడ్డి,బి. తిరుపతిరెడ్డి,వి. శంకర్ సాంబరాజు తదితరులున్నారు.

# దళితరత్న అవార్డు గ్రహీతగా నాగుల మల్లేష్‌కు సత్కారం



కూకట్‌పల్లి, ప్రజాస్ఫూర్తి : ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర నగర్‌లోని పీజేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవకుడు నాగుల మల్లేష్‌కు "దళితరత్న" అవార్డును ఘనంగా అందజేశారు. ఈ అవార్డును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగుల మల్లేష్ మాట్లాడుతూ, తాను చేస్తున్న సేవలను గుర్తించి దళితరత్న అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పర్వత సతీష్ కుమార్, బాష్పాక యాదగిరి, సంజీవరావు, మాల మహానాడు కుల రాజ్యాధికార పార్టీల కన్వీనర్ కొంగర నరహరి, అల్లిబిల్లి కుమారస్వామి, భూషణం, జిల్లా వెంకటేష్, మాల మహానాడు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

* **సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన జెనిగల నీరజ, సిలివేరు మౌనిక, వనం జ్యోతి, వేముల పద్మ, కొయిగూర నీరజ, వరకాంతం అశ్విని, ఏచూరి పూజితలకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆడపిల్లల వివాహానికి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేయడం సంతోషకరమన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆది మహావిష్ణువు దేవస్థానం కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, బొమ్మ మైసయ్య, పన్నాల రాజు రెడ్డి, బొమ్మ అమరావతి, దోనూరి కిరణ్ రెడ్డి, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు తదితరులు చేశారు.

# భూపాలపల్లిలో సమ్మర్ క్రికెట్ క్యాంప్ ప్రారంభం



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్‌ను స్థానిక కృష్ణ కాలనీలోని అంబేద్కర్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ పొందడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సరైన శిక్షణతో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరచవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్నాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోచ్‌లు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

* **అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్‌తో కలిసి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ స్నేహ శబరిష్.**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, వారి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో నమోదైన ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. కేవలం నివేదికల కోసమే కాకుండా, బాధితుడికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలి. ఒకవేళ సమస్య తిరస్కరణకు గురైతే, దానికి గల స్పష్టమైన కారణాలను అర్జీదారునికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి అని అన్నారు.రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ భూ సమస్యలు, ఇతర సామాజిక సమస్యలను పరిష్కరించాలి. ధరణి సమస్యలు, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ళు, భూ వివాదాలు, స్థానిక సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేస్తూ, వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. మహబూబాబాద్ మండలం చొక్లాతండా కు చెందిన భూక్య సుందర్ నాయక్ చోక్లాతండ గ్రామపంచాయితీ మేఘ్యాతండ లో నీటి కొరత ఉండటం వలన ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రజలు వేరే చోటు నుండి నీరు తెచ్చుకోవడం ఇబ్బందులకు గురి అవుతున్నారని చొక్లా తండ గ్రామ పంచాయతీలో మరియు మేగ్యాతండ లో రెండు బోర్లు వేయించి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బయ్యారం మండలం, మిర్యాలపెంట గ్రామపంచాయతీ లోని పి.హెచ్.సి లో ఎం.బి.బి.ఎస్ డాక్టర్ ని నియామించాలని జిల్లా కేంద్రానికి మా గ్రామం దూరంగా ఉందని గ్రామ ప్రజలు వైద్యం విషయంలో చాల ఇబ్బందులు పడుతున్నారని మా గ్రామ పి.హెచ్.సి లో ఎం.బి.బి.ఎస్ డాక్టర్ ని నియామించి వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మెన్ వర్స ప్రకాష్ బయ్యారం మండలం లోని కొత్తపేట గ్రామపంచాయతీలో కొత్తపేట,గంధంపల్లి రెవెన్యు గ్రామములో గల ప్రభుత్వ భూములను ఏజెన్సీ యాక్ట్ ప్రకారం గిరిజనేతరులు ప్రభుత్వ భూములు ఏవిధంగా అనుభవిస్తున్నారో వారికి అట్టి హక్కు ఏవిధంగా సంక్రమిచినదో తెలుపాలని, కొత్తపేట, గంధంపల్లి రెవెన్యు గ్రామములలో గల ప్రభుత్వ భూములను సర్వే చేపించి ఈ యొక్క భూములను ప్రభుత్వ పరిధిలోని తీసుకోవలసిందిగా కోరారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయి, జిల్లాలో సోమవారం నుండి ప్రారంభమైన యువజన క్రీడా దినోత్సవ పోస్టర్ను ఆవిష్కరించి జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి పదవి నుంచి బండి సంజయ్ ని భర్తరఫ్ చేయాలి

* **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాక్షస పాలన కొనసాగిస్తున్నాయి.**
* **హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ బాబు**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు ఫోక్సో కేసు పైన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ రాస్తారోకో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నిష్పాక్షిక విచారణ కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ ని వెంటనే పదవి నుండి భర్తరాఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోడీ ఆడపిల్లల కోసం భేటీ బచావో బేటి పడావో అన్న నినాదం ఇప్పుడు ఏమైందని ఆయన ప్రశ్నించారు. మైనర్ బాలికను అన్యాయంగా కేంద్రమంత్రి కొడుకు లొంగదీసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డ ఇప్పటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు మౌనం వహిస్తున్నాయో తెలపాలని అన్నారు. బండి సంజయ్ పిలిచి బాధిత కుటుంబాన్ని బెదిరించి వాళ్లను మరీ ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశాడని ఇంత తీవ్రమైన కేసును మీరుగార్చె ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర సర్కార్ పై ధ్వజమెత్తారు. కచ్చితంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ను వెంటనే భర్తరాఫ్ చేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేకపోతే రేపు ఏ ఆడపిల్ల కూడా ధైర్యం చేయలేదని అఘాయిత్యం జరిగిన ముందుకు వచ్చే ధైర్యం ఆడపిల్లలు చేయరని ఆయన అన్నారు.ఆ అమ్మాయి తరపున బిఆర్ఎస్ శ్రేణులు విద్యార్థి సంఘాలు మహిళా సంఘాలు సోషల్ మీడియా మొత్తం అండగా ఉంటుందని ధర్మం గెలిచే వరకు పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు అన్నారు.అనంతరం హుస్నాబాద్ మండలం పందిళ్ళ గ్రామంలోని రైస్ మిల్లర్లను సందర్శించారు అక్కడ రైతులతో ముచ్చటించారు రైతుల వరి ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్న సంగతిని రాష్ట్రప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు కనీసం రైతులు పండించిన పంటను కొనే దిక్కు లేకుండా పోయిందని రోజుల తరబడి లైన్లో వేచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందని ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో సర్కార్ విఫలమైందని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గడ్డ బీసీలకు అడ్డగా మారనుంది

* **బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు అయిగోని రాఘవేంద్ర గౌడ్**



చిల్పూర్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ గడ్డ బీసీలకు అడ్డగా మారనుందని రానున్న 2028 లో బీసీలు అధికారం చెప్పడం ఖాయమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు అయిగోని రాఘవేంద్ర గౌడ్ ధీమా వ్యక్తం చేశారు... సోమవారం చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామంలో నిర్వహించిన 6వ రోజు నిర్వహించిన బీసీ రాజ్యాధికార పాదయాత్రకు ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశం లో రాఘవన్న మాట్లాడుతూ అధికారం లక్ష్యంగా బీసీ సమాజంలో రాజకీయ చైతన్యం పెరిగింది అన్నారు బీసీలు బలమైన శక్తిగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సింహ భాగంగా ఉన్న బీసీలను పాలకులు కాకుండా పాలితులుగా.. జెండాలు మోపే వారిగా ఓట్లు వేసే యంత్రాలు గా అనొచ్చి వేస్తున్నారని అన్నారు... రాబోయే ఎన్నికల్లో బీసీలే సత్తా చాటుతారని అన్నారు పాదయాత్రతో అగ్రవర్ణాల్లో గడ పుట్టిందని ఆయన అన్నారు.. బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా చైతన్య తీసుకువచ్చేందుకే పాదయాత్ర చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. త్వరలో ఓరుగల్లు పోరుగల్లులో భారీ ఎత్తున సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు... ఈ సమావేశంలో జనగామ జిల్లా బీసీ రాజ్యాధికార సమితి ప్రధాన కార్యదర్శి సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి పద్మశాలి, చిన్న పెండ్యాల గ్రామ సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ సుదర్శన్,మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, పద్మశాలి సంఘం మండల ఇంచార్జ్ గజ్జల దామోదర్ పద్మశాలి, జనగాం యాదగిరి,తాళ్ల పెళ్లి శివకుమార్ గౌడ్, మాచర్ల యాదగిరి గౌడ్, తాళ్ల పెళ్లి క్రాంతి కుమార్ గౌడ్, పేరాల నాగభూషణం,షాగా కనకయ్య ముదిరాజ్,ఎన్ శుక్రాచారి,కొన్ని లింగయ్య గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ




మహబూబాబాద్. ప్రజాస్ఫూర్తి : సేవకు పర్యాయపదంగా నిలిచిన మహబూబాబాద్ రోటరిక్లబ్ సేవలు భేష్ అని మహబూబాబాద్ డీఎస్పీ నంబురి తిరుపతి రావు ప్రశంసించారు.సోమవారం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. రోటరిక్లబ్ అధ్యక్షుడు వేమిశెట్టి కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ నంబురి తిరుపతి రావు, టౌన్ సిఐ రఘుపతి రెడ్డి, రోటరిక్లబ్ వ్యవస్థాపకులు మాలె నాగేశ్వరరావు, వద్దుల సురేందర్ రెడ్డి లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రోటరిక్లబ్ తన సేవలు అందించి సమాజ మార్పుకోసం ప్రయత్నిస్తోందని అన్నారు. 1920 చికాగో నగరంలో పాల్ హ్యారీస్ అధ్యక్షతన ప్రారంభమైన రోటరీ పయనం సేవారంగంలో ఎన్నో మైలురాళ్లు దాటిందని పేర్కొన్నారు.శాంతిస్థాపన, పర్యావరణం,విద్య,వైద్యం,మహిళా సాధికారత తదితర అంశాల్లో రోటరీ సేవలు అసామాన్యమైనవని హర్షం వ్యక్తం చేశారు. ఆరు కుట్టుమిషన్లు మహిళలకు అందజేసి వారి ఆత్మగౌరవానికి బాటలు వేశారని అన్నారు. మహిళలు ఎవరిమీదా ఆధార పడకుండా తమకాళ్ళపై తాము నిలబడే విధంగా ఇలాంటి సేవాకార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. మహబూబాబాద్ ప్రాంతంలో విద్యార్థులకు టీవీలు, ల్యాప్ టాప్ లు, బెంచీలు, విద్యార్థినిలకు సైకిళ్ళు, రీయుసబుల్ సానిటరీ ప్యాడ్స్,వాటర్ ప్లాంట్ లు, యువత స్వయం ఉపాధి కోసం గేదెలు, కృత్రిమ కాళ్ళు చేతులు, వినికిడి యంత్రాలతో పాటు గత పద్దెనిమిదేండ్లుగా రోటరిక్లబ్ సేవలు ఎవరెస్టు శిఖరమంత ఎదిగాయని హర్షధ్వానాల మధ్య అన్నారు. ఏదేమైనా గతం, వర్తమానం లాగానే భవిష్యత్తులో సైతం మహబూబాబాద్ రోటరిక్లబ్ సేవలు విస్తృతంగా ఉండాలని ఆకాంక్షించారు. డీఎస్పీ నంబురి తిరుపతి రావు,సిఐ రఘుపతి రెడ్డి లకు రోటరిక్లబ్ తరపున బొకే శాలువతో ఆత్మీయ సన్మామనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రోటరిక్లబ్ సెక్రెటరీ జంగాల విజయ్ కుమార్,డిస్ట్రిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ తోర్నాల నగేష్ కుమార్, ట్రెజరర్ శంతన్ రామరాజు, బోనగిరి గిరిధర్ గుప్తా, కొదారి నాగేందర్, గూడూరు నాగేశ్వరరావు,ముల్లంగి మోహన్ రెడ్డి,నాళ్ళ లక్ష్మి నరసింహారావు, దూదికట్ల సత్యం, జంగాల నర్సింహా రావు, తోడేటి వెంకన్న,వల్లాల రమేష్, జంగాల మంగపతి రావు, అచ్చ శ్రీనివాస్, కట్ల వెంకన్న, మాలె శ్రావణ్, కుట్టుమిషన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో ఉత్సాహంగా 5కే రన్



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : 99 డేస్ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం భూపాలపల్లిలో 5కే రన్ నిర్వహించారు. స్థానిక హనుమాన్ టెంపుల్ నుంచి కృష్ణా కాలనీ అంబేద్కర్ గ్రౌండ్ వరకు నిర్వహించిన ఈ రన్‌లో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, పోటీ తత్వం అలవడతాయని పేర్కొన్నారు. యువత ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ యువత ప్రతిభను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా క్రీడల అధికారి, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్నాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఆర్ఓ పద్మావతి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా (డిఆర్ఓ) నియమితులైన ఎస్. పద్మావతి సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందచేశారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# వసంతనగర్ లో మాయమైన శిలాఫలకం

ప్రస్తుత ప్రాంతం



మాయమైన శిలాఫలకం



*** నాటి పిజెఆర్ ఆనవాళ్లు మాయంపై స్థానికుల ఆగ్రహం**

*** అక్రమ నిర్మాణానికి అడ్డుగా ఉందనే తొలగించారా..?**

(కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి) : తన అక్రమ నిర్మాణానికి అడ్డుగా ఉందని ప్రభుత్వ నిర్మాణాన్ని తొలగించాడు ఓ ప్రభుద్ధుడు. నిబంధనలు తుంగలో తొక్కి అక్రమంగా షటర్ లు వేయడమే కాకుండా ఏకంగా నాటి ఎంఎల్ ఏ పిజెఆర్ జ్ఞాపకం ఉన్న శిలపలకం కూల్చివేశాడు. అంతా బహిరంగా చేస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని వసంత్నగర్ డివిజన్లో ఓ నిర్మాణదారుడి తతంగం. రెసిడెన్షియల్ అనుమతులను తీసుకోని అక్రమంగా కమర్షియల్ వినియోగానికి అనుగుణంగా షటర్లు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా గతంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా తొలగించాడు. 2007 సంవత్సరంలో సుమారు రూ.66 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారుల ఆధ్వర్యంలో ఒక శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే తన భవనం కు అడ్డుగా వస్తుంది అనుకున్నాడో...



ఏమో... శిలాఫలకం కనిపించకుండా పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తన భవన పనులకు ఆటంకం కలుగుతుందనే కారణంతోనే దానిని తొలగించి ఉండవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక రెసిడెన్షియల్ జోన్లో కమర్షియల్ షటర్లు ఏర్పాటు చేయడంపై కూడా కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు పెరగడం వల్ల ట్రాఫిక్, పార్కింగ్, శబ్ద కాలుష్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం తక్షణమే విచారణ చేపట్టి, నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రజా పనులకు సంబంధించిన గుర్తింపులను స్వేచ్ఛగా తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## 'సైమ' ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలిగా గోలి నవ్య రెడ్డి నియామకం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : అట్లాంటా (అమెరికా),సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ (సైమ) అంతర్జాతీయ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలిగా అట్లాంటాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయురాలు, తెలంగాణలోని నల్లగొండ జిల్లా వాస్తవ్యులు గోలి నవ్య రెడ్డి నియమితులయ్యారు. అమెరికాలోని అట్లాంటా నగరంలో ఆదివారం ఘనంగా జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో 'సైమ' ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి ఆమెకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి మాట్లాడుతూ.. 'సైమ' కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎన్ఆర్ఐ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నవ్య రెడ్డి నేతృత్వంలో ఈ విభాగం అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం అవుతుందని, ఆమె తన వృత్తిపరమైన అనుభవంతో బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. తమపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలనుఅప్పగించినందుకు గోలి నవ్య రెడ్డి 'సైమ' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సౌత్ ఇండియన్ మీడియా ప్రతినిధులను, ప్రవాస భారతీయులను ఒకే తాటిపైకి తెస్తూ అసోసియేషన్ ఆశయాల సాధనకు శరవేగంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని పలువురు ప్రవాస భారతీయులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొని నవ్య రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## యువజన, క్రీడల వారోత్సవాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్




జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వ హిస్తున్న యువజన, క్రీడల వారోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణం లో 2 కే రన్, యోగా కార్యక్రమాలు నిర్వ హించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన 2 కె రన్ ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ ఐడీఓసీ నుంచి చౌరస్తా మీదుగా ధర్మకంచ మినీ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం స్టేడియం లో యోగా కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన,క్రీడల అధికారి ఎన్. లక్ష్మీనరసింహా రావు మాట్లాడుతూ యువత ఆరోగ్యవంత మైన జీవన శైలిని అలవర్చుకోవడంలో క్రీడలు, యోగా కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఆర్డీఓ గోపిరామ్, సి.ఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, యువత, క్రీడాకారులు, విద్యార్థులు, వాకర్స్, ప్రజలు పాల్గొన్నారు.

## పర్యాటక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్




జనగామ, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్ర మం లో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం లో పర్యాటక శాఖ రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, యువ టూరిజం క్లబ్స్ కార్యాచరణ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 18 నుంచి 23 వరకు జిల్లా లో పర్యాటక వారోత్స వాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, చారిత్రక వారసత్వం, పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత ను ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యం తో ఈ కార్యక్రమాలు చేపడు తున్నట్లు పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్లో హెరిటేజ్ వాక్‌లు, స్వచ్ఛత కార్య క్రమాలు, సెమినార్లు నిర్వహించ నున్నట్లు తెలిపారు.జిల్లా లోని పాఠశాలలు, కళాశాలల్లో పర్యాటక అవగాహన పెంపొందించే ఉద్దేశంతో యువ టూరిజం క్లబ్స్ ఏర్పాటు చేసి, విద్యార్థులను జూనియర్ టూరిజం అంబాసిడర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం లో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నర్సింహారావు, జడ్పీ సీఈఓ రంగారావు, డీఆర్డీఓ, హౌసింగ్ పీడీ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులకు అందించాలి

*** సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు డిమాండ్.**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పట్టణంలోని పాత కొత్తగూడెంలో గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబల్ బెడ్ రూమ్‌ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని మాజీ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రామవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్రూంల నిర్మాణాన్ని చేపట్టి నిర్మాణాలు పూర్తి కాకుండానే లబ్ధిదారులను నిర్ణయించడం జరిగిందని అన్నారు. అది ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన మోసంగా పరిగణించక తప్పదని ఆయన విమర్శించారు. 2016లో పాత కొత్తగూడెంలో 826 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారని, అందులో కనీసం 200 గృహాలు కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ల నిర్మాణం పూర్తికాక, ఇటు ఇందిరమ్మ గృహాలు మంజూరు కాక లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వీటికి నిధులను కేటాయించాలని, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఓం నారాయణ, గడిదాసు కుమార్, బత్తుల పద్మ, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ

*** జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. కోడంగల్ సబ్ డివిజన్ పరిధిలోని పలు వరి కొనుగోలు కేంద్రాలు, గోదాములు , రైస్ మిల్లులను సందర్శించి అక్కడి పరిస్థితులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తో కలిసి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంరాస్‌పేట్ గ్రామం , బురన్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న పిపిసి కేంద్రాలను పరిశీలించారు. అనంతరం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలోని పిపిసి కేంద్రం, గోదాంను సందర్శించి ధాన్యం నిల్వలు, రవాణా , కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే దుద్యాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం గ్రామంలో ఉన్న రైస్ మిల్‌ను పరిశీలించి అక్కడి నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చూడడం , గోదాముల నిర్వహణపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయించేందుకు పోలీస్ శాఖ అన్నివిధాల సహకారం అందిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మధ్యవర్తుల జోక్యం లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ధాన్యం రవాణాలో జాప్యాన్ని నివారించడం వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తాము ఇప్పటికే డీఎస్పీ స్థాయి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు వారు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో పరిగి డిఎస్పి శ్రీనివాస్ , కోడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి లు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన శిక్షణ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం నేప్ -2020) లో భాగంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రాంతాలలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఆర్.పి లు మరియు ఎస్.ఎల్.ఎఫ్ ఓబిలకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర డి.డి. చి. అనిల్ కుమార్ డి.ఎం.సి శివాజీ టి.ఎం.సి శ్రీనివాస్ సి.ఓలు, సి.ఎల్.ఆర్.పిలు, ఆర్.పిలు ఎస్.ఎల్.ఎఫ్ ఓబిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలు మరియు నిరక్షరాస్యులకు చదవడం, రాయడం మాత్రమే కాకుండా డిజిటల్ అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్లు, ఏటీఎం వినియోగం వంటి అంశాలలో అవగాహన పెంపొందించడం ద్వారా మహిళలు ఆర్థికంగా , సామాజికంగా మరింత బలపడతారని పేర్కొన్నారు. ప్రతి మహిళ చదువుకుంటే ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆమె అన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు చట్టపరమైన అవగాహన, పౌర హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. డి.డి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఆర్థిక క్రమశిక్షణ ప్రతి కుటుంబానికి అత్యంత అవసరమని తెలిపారు.డి.ఎం.సి శివాజీ మాట్లాడుతూ, ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారడం ద్వారానే సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.పిలు , ఎస్.ఎల్.ఎఫ్ సభ్యులకు ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానం , ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై విస్తృతంగా శిక్షణ ఇచ్చారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులకు అందించాలి

*** సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు డిమాండ్**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పట్టణంలోని పాత కొత్తగూడెంలో గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబల్ బెడ్ రూమ్‌ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని మాజీ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రామవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్రూంల నిర్మాణాన్ని చేపట్టి నిర్మాణాలు పూర్తి కాకుండానే లబ్ధిదారులను నిర్ణయించడం జరిగిందని అన్నారు. అది ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన మోసంగా పరిగణించక తప్పదని ఆయన విమర్శించారు. 2016లో పాత కొత్తగూడెంలో 826 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారని, అందులో కనీసం 200 గృహాలు కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ల నిర్మాణం పూర్తికాక, ఇటు ఇందిరమ్మ గృహాలు మంజూరు కాక లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వీటికి నిధులను కేటాయించాలని, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఓం నారాయణ, గడిదాసు కుమార్, బత్తుల పద్మ, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పై ప్రత్యేక దృష్టి సారించాలి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి కి వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీల పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారు లను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీ దారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 262 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు.వచ్చిన దరఖాస్తుల ను సంబంధిత శాఖల అధికారు లకు కేటాయిస్తూ,ప్రజా సమస్యల పై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాలను వేగవంతం చేయాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో జెడ్పీ సీఈఓ రంగారావు, జనగామ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సీపీఓ చిన కోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక వసతులు కల్పనకు చర్యలు

**: కలెక్టర్ కె హరిత**




ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: నీతి అయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్ లో భాగంగా అకాక్షింత జిల్లా కార్యక్రమములో జిల్లాలో మౌళిక వసతులకు కల్పనకు చర్యలు తీసుకుంటునట్లు కలెక్టర్ కె హరిత అన్నారు సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేశ రాజధాని న్యూ డిల్లి లోని నీతి అయోగ్ కార్యాలయం నుండి నీతి అయోగ్ సి ఈ వో నీతి చిబ్బార్ గారు ఇతర ఉన్నత అధికారులతో కలిసి దేశంలోని అకాంక్షిత జిల్లా అకాక్షింత బ్లాక్ లో నీతి అయోగ్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు మౌళిక వసతుల కల్పన ఎంపవర్మెంట్ పై నిర్హహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె హరిత పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ ద్వారా అకాక్షింత జిల్లా కార్యక్రమము, అకాక్షింత బ్లాక్ కార్యక్రమము లో భాగంగా మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటూన్నామన్నారు తిర్యాని మండలంలో ఆర్ట్ విలేజ్ మరియు లైబ్రరి ప్రాజెక్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటూన్నామన్నారు ఈ కార్యక్రమములో డి వై ఎస్ ఓ వెంకటేశ్వర్లు అకాక్షింత మండల సమన్వయ కర్త బాలరాజు రాజారామ్ పాల్గొన్నారు

## హఫీజ్పేట్లో భారీ మోసం.. బోర్డు తిప్పేసిన కన్సల్టెన్సీ

హైదరాబాద్: మియాపూర్ పీఎస్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హఫీజ్‌పేట్‌లో సీడీ దశరథ్ కన్సల్టెన్సీ బోర్డు తిప్పేసింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను ముగ్గురు నిందితులు మోసం చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.6లక్షలు చొప్పున వసూలు చేశారు. నిందితులు అర్చన, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం పోలీసులు గాలింపు చేపట్టారు. బాధితులు ఎంతమంది ఉన్నారనే అంశంపై విచారణ కొనసాగిస్తున్నారు.

## శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

**– పీస్ మీటింగ్‌లో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శాంతియుత వాతావరణంలో పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ అన్నారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ అండ్ ఎం ఫంక్షన్ హాలులో మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. పండుగ ఏ మతానిది అయినా సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయటం జరిగిందని, ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం 2టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, త్రీ టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా కేంద్రంలో భారత రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన “ ప్రణామ్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ” ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రం లోని సౌకర్యాలను పరిశీలించినకలెక్టర్, వయో వృద్ధులతో ఆత్మీయంగా ముచ్చటించారు. కొంత సమయం వారి తో కలిసి చెస్, క్యారమ్, టేబుల్ టెన్నిస్ ఆటలు ఆడి సందడి చేశారు. వృద్ధు లకు ఆరోగ్యకరమైన వాతావరణం, మానసిక ఉల్లాసం కల్పించేలా ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు.కార్యక్రమం లో ఐఆర్సీఎస్ జిల్లా చైర్మన్ లవకుమార్ రెడ్డి, కార్యదర్శి కన్నా పరశురాములు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతలేదు.. వదంతులు నమ్మొద్దు

**: ఓఎంసీలు**



హైదరాబాద్: తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని.. ఎక్కడా కొరత లేదని రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని రాష్ట్ర కోఆర్డినేటర్ తెలిపారు. రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసీలు నమోదు చేశాయన్నారు. ‘‘వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగులు తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగులు చేయడం లేదు. ఈనెలలో 17వ తేదీ వరకు మొత్తం 20.06లక్షల ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశాం. ఈ సీజన్‌కు ఇది సాధారణం. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ విధానమైన డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) వ్యవస్థను అనుసరించాలని కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం డీఏసీ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. రాష్ట్రంలో డీఏసీ అమలు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి’’ అని ఓఎంసీలు పేర్కొన్నాయి. నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు ఓఎంసీలు విజ్ఞప్తి చేశాయి. విశ్వసనీయ సంస్థలు అందించే వార్తలను మాత్రమే నమ్మాలని సూచించాయి.

## బండి సంజయ్ తప్పు చేయలేదు : రాంచందర్రావు

హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు భాజపాపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. వ్యక్తిని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ‘‘బండి సంజయ్, భాజపాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. రూ.కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్రమంతా పోస్టర్లు వేయించారు. బండి సంజయ్ తప్పు చేయలేదు. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలుంటాయి. సంజయ్‌ను లక్ష్యంగా చేసుకొని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలపై 67 శాతం క్రైమ్ రేటు పెరిగింది. జూబ్లీహిల్స్ బాలిక కేసులో కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే.. రాజీనామా చేశారా? ఓ మహిళా సర్పంచి తనను బీఆర్ఎస్ ఎమ్మెల్యే లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేస్తే పార్టీ పరంగా ఏం చర్యలు తీసుకున్నారు? కేటీఆర్‌కు నైతిక విలువలు లేవు. మీ ఇంటి ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదు? ప్రజా సమస్యలపై పోరాటం చేయడం చేతగాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలి.

# శారీరం మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఒక్కరూ శారీరక మానసిక ఆరోగ్యం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న విద్యా గ్రామర్ స్కూల్లో నిర్వహించిన యోగ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించడంజరుగుతున్నది. ఇందులో భాగంగా ఈనెల 18 నుండి 23 వరకు యువజన వారోత్సవం నిర్వహించనున్నాము. ఇందులో భాగంగా సోమవారం” ఫిట్ & యాక్టివ్ తెలంగాణ” లో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి, ఈ వారం రోజులపాటు ఫిట్ తెలంగాణ ఫిజికల్ లీటరసి పైకార్యక్రమాలు ఉంటాయి.మనుషులు ప్రతిరోజు వివిధ పనుల నిర్వహించడం వల్ల శరీరం అలసటకు గురవుతుంది, అందువల్ల ఆరోగ్యకరమైన భోజనంతోపాటు, వ్యాయామం ,యోగ వంటివి చేయాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫిట్నెస్ పై ప్రతి ఒక్కరు దృష్టిసారించాలి. యోగ ,శారీరక వ్యాయామం ఇందుకు పనికొస్తాయి. యోగా జీవితంలో ఒక భాగం కావాలి. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ అనుసరిస్తే ఎలాంటి రోగాలు దరిచేరావు. ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చు అన్నారు. ఈ వారం రోజులపాటు ఫిట్ నెస్ తో పాటు, పర్యాటకానికి సంబంధించిన కార్యక్రమాలను సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా క్రీడలు ,యువజన సర్వీసుల శాఖ అధికారి అక్బర్ అలీ ,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన 2 కే మారథన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించి రన్ లో పాల్గొన్నారు.

# సింగరేణి స్థితి గతులపై అవగాహన




ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: బెల్లంపల్లి ఏరియా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ లో మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ అధికారులు సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధిపతులకు సింగరేణి సంస్థ గతంలో సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణ, ఉద్యోగులు,మహిళ ఉద్యోగులు ,యంత్రాల వినియోగం పై పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ..సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్ లో లక్ష్యాల సాధనకు ఉద్యోగుల పనితీరు ఎలా ఉండాలో వివరించారు. సంస్థ మనది అనుకోని పనిచేస్తే భావితరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సంస్థ అభివృద్ధికి కోసం చేపట్టాల్సిన కార్యాచరణ పై అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కిరణ్ , శేష శయన రావు, ఏరియా అధ్యక్షులు మరియు ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఇంచార్జి ఎస్ ఓ టు జిఎం ఎన్ ఉమాకాంత్, డీజీఎం (ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహారా అన్ని విభాగాల హెచ్ ఓ డి లు పాల్గొన్నారు.

## భూ సంబంధిత తగాదాలు ఉంటే చట్ట పరిధిలో పరిష్కరించుకోవాలి

*** జిల్లా ఎస్పి నరసింహ**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలపెన్ పహాడ్ గ్రామంలో భూతగాదాల నేపథ్యంలో జరిగిన మహిళ హత్య ఘటన స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పరిశీలించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఘటన జరిగిన ప్రదేశంలో క్లూస్ టీం సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది ఆధారాలు సేకరించాయి. నేరానికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేసును వేగంగా దర్యాప్తు చేసి కోర్టుకు పంపించాలని అధికారులకు సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామానికి చెందిన సురిగి సైదులు సొంత అక్క అంజమ్మకు ఇద్దరికీ భూవివాదం నెలకొని ఉంది, దీనికి సంబంధించి గతంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది, ఇరువర్గాలను కూడా బైండోవర్ చేసి హెచ్చరించడం జరిగిందని తెలిపారు. అక్క ఉంటే భూమి నాకు దొరకదని అక్కను తప్పిస్తే త్వరగా భూమి తన సొంతం చేసుకోవచ్చని భావించిన నిందితుడు సైదులు సోమవారం రోజు ఉదయం కరువు పని నిమిత్తం వెళుతున్న అంజమ్మ పై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడని ఎస్పీ అన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ భూ సంబంధిత తగాదాలు ఉంటే కోర్టుల సమక్షంలో, పెద్దమనుషుల సమక్షంలో చట్టపరంగా పరిష్కరించుకోవాలి అని చట్టాన్ని ఉల్లంఘించి భౌతిక దాడులు చేసిన హత్యలు చేసిన జైలుకు వెళ్లడం తప్పదు అని అన్నారు. నేరానికి పాల్పడ్డ సైదులు పై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు హత్య కేసు నమోదు చేయడం జరిగింది . త్వరితగతిన కేసు దర్యాప్తు చేసి నేరస్తులను శిక్ష పడేలా చేస్తామని బాధ్యత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తుందని అన్నారు. ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎస్సైలు మహేష్, ఐలయ్య, గోపికృష్ణ పోలీస్ సిబ్బంది ఉన్నారు

# రైతుల కోసమే కేసీఆర్ పోరాటం

*** రైతు వ్యతిరేకంగా రేవంత్ పాలన: జగదీష్‌రెడ్డి**



నల్లగొండ , ప్రజాస్ఫూర్తి : రైతుల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం పోరాటం చేశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు మళ్లీ తెలంగాణలో కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఒకప్పుడు ఫ్లోరైడ్ సమస్యతో నల్లగొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా, కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఆ సమస్యను పరిష్కరించిందన్నారు. కేంద్రం వద్దు కొనుగోలు చేయకపోతే కేసీఆర్ ఢిల్లీలో ధర్నా చేసి రైతుల పక్షాన పోరాడారని గుర్తుచేశారు.24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు వంటి పథకాలతో రైతులను ఆదుకున్న నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లు సకాలంలో నిర్వహించి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసేవారమన్నారు. ప్రస్తుతం సీఎం ఏ. రేవంత్ రెడ్డి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలో మంత్రులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. వడ్లలో తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే సహించబోమని హెచ్చరించారు.తాను మంత్రిగా ఉన్న సమయంలో రోజుకు వందల కిలోమీటర్లు పర్యటిస్తూ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలు నిర్వహించేవాడినని తెలిపారు. ప్రస్తుతం ఒక్క మంత్రి కూడా రైతుల వద్దకు వెళ్లడం లేదన్నారు. “మోదీ-చంద్రబాబు మద్దతుతో నడుస్తున్న హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రభుత్వం” రాష్ట్రంలో కొనసాగుతోందని, రైతులే ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చేశారని అన్నారు. ఇందిరాపార్క్, ఢిల్లీలో ధర్నాలు నిర్వహించి కేంద్రాన్ని ఒప్పించారని పేర్కొన్నారు. రైతుబంధు కింద వేలాది రూపాయలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరేనని వ్యాఖ్యానించారు.ప్రస్తుత ప్రభుత్వం రైతుల సమస్యలను పక్కనపెట్టి రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు రైతుల సమస్యలను ప్రస్తావించకుండా ఇతర అంశాలపై మాత్రమే చర్చించారని విమర్శించారు. ధర్నాలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో రైతులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

## హైదరాబాద్లో హైటెక్ మాల్ప్రాక్టీస్.. 12 మంది అరెస్టు

హైదరాబాద్: నగరంలోని మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో హైటెక్ మాల్‌ప్రాక్టీస్ రాకెట్‌ను నాచారం పోలీసులు ఛేదించారు. సీఎస్ఐఆర్‌ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (CSIRIICT) మల్టీటాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగ నియామక పరీక్షలో ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తించారు. అత్యాధునిక రహస్య ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో పరీక్షలో అక్రమాలకు పాల్పడుతున్న 12 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

## జిల్లా కలెక్టర్ పై తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదు

**: కేవీఎల్ఎన్ రెడ్డి.**




జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై కొంత మంది ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ఫిర్యాదు చేయడాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీ ఎల్ ఎన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు . సోమవారం జిల్లా కలెక్టర్ కార్యా లయం ఎదుట మాట్లాడుతూ ప్రజలకు అందు బాటులో ఉండి సేవలు అందిస్తున్న కలెక్టర్ పై వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా పరిపాలనలో పారదర్శకత తీసుకువచ్చారని, ప్రభుత్వ ఉద్యోగులను ప్రజలకు అందు బాటు లో ఉండేలా చేశారని తెలిపారు. గతం లో పైరవీలు చేసుకునే కొందరికి ఇప్పుడు అవకాశాలు లేకపోవడం తోనే కలెక్టర్ పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రౌండ్ టేబుల్ సమావేశం అంటే ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీలను కలుపుకొని నిర్వహించే దని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్వహించేదికాదని అయన పేర్కొన్నారు. సాదిక్ ఫౌండేషన్ అధ్యక్షులు సాదిక్ అలీ తో కలిసి కొందరు మంచి అధికారి పై ఇన్ చార్జ్ మంత్రికి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.కలెక్టర్ నిజంగా అవినీతికి పాల్పడితే అందరం కలిసి పోరాడదాం,కానీ ఎ లాంటి ఆధారాలు లేకుండా బూటకపు ఆరోపణలు చేయడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణలో పలు జిల్లాలకు వర్షసూచన



హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో ఇవాళ, రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. గంటకు 40 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.మరోవైపు ఎల్లుండి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. ఇవాళ, రేపు కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

## కేబీఆర్ పార్కు పరిధిలో చెట్లను నరకొద్దు: సుప్రీం కోర్టు



హైదరాబాద్: నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పార్కు పరిధిలో పర్యావరణ సున్నిత ప్రాంతంలో 25 30 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను కొట్టేయొద్దని ఆదేశించింది.ఈ పనుల కోసం పార్కు పరిధిలో సుమారు 1,300 చెట్లు నరికేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వివేక్‌రెడ్డి వాదించారు. ప్రణాళిక ఏమైనా ఉందా? చెట్లు తొలగించకుండా నిర్మించవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. అలాంటిదేమీ లేదని న్యాయవాది వివేక్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వమే చెట్లను తొలగిస్తోందని.. రాత్రి, పగలు తేడా లేకుండా చెట్లు నరుకుతున్నారని వివరించారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లు నరకొద్దని అభివృద్ధి బోర్డు చెప్పిందన్నారు. వాదనల అనంతరం ప్రతివాదులుగా రాష్ట్రప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 27కి వాయిదా వేసింది.

## ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు..!



**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీచేసింది. ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని సోమవారం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతోపాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టంచేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి దిగ్గజ సంస్థలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి.

కేంద్ర ఆర్థిక సేవల విభాగం తాజా ఉత్తర్వులు జారీచేసింది. అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని కేంద్రం సూచించింది. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితి పాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొన్నది. వీటితోపాటు ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలవల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి మోదీ గతవారం పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతలవల్ల దేశ ఆర్థికవృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే భారత కరెన్సీ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సౌకర్యాన్ని కూడా కల్పించాయి.

## రికార్డు కనిష్ఠానికి రూపాయి విలువ..



**న్యూఢిల్లీ:** రూపాయి విలువ సోమవారం జీవనకాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి 96.20 వద్ద ఆల్ టైమ్ లోయర్ స్థాయికి చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయడం రూపాయి విలువపై ప్రభావం చూపింది. దాంతో భారీ పతనం నమోదైంది. అమెరికన్ డాలర్‌తో పోల్చితే గత శుక్రవారం తొలిసారిగా రూ.96 మార్కును దాటిన రూపాయి, సోమవారం మరింత బలహీనపడింది.

ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. యూఏఈలోని ఓ అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 111 డాలర్లకు పెరిగింది. దీనికి తోడు ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగవచ్చన్న సంకేతాలు కూడా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. రూపాయి రికార్డు స్థాయి పతనం దేశ స్థూల ఆర్థిక దృక్పథంపై ఆందోళనలను తీవ్రతరం చేస్తోంది.

ఈ బలహీన సెంటిమెంట్ స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపింది. సోమవారం సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247 పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి. మరోవైపు, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ చర్యలు చేపట్టాయి. వెండి దిగుమతులపై ఆంక్షలు విధించడంతో పాటు, కరెన్సీ మార్కెట్లలో ఆర్బీఐ జోక్యం చేసుకుంటోంది. ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు..

**ఆదుకున్న ఐటీ షేర్లు**

**రోజులో నష్టాల నుంచి కోలుకుని ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు**

**సెన్సెక్స్ 77 పాయింట్లు, నిఫ్టీ 6 పాయింట్ల స్వల్ప లాభం**

**మార్కెట్లను ఆదుకున్న ఐటీ, ఫార్మా షేర్లు**

**మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలలో అమ్మకాల ఒత్తిడి**

**పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అప్రమత్తంగా ఇన్వెస్టర్లు**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. రోజులో చాలా వరకు నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు, చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద, నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడ్డాయి.

ఇవాళ్టి ట్రేడింగ్‌లో ఐటీ రంగం స్టార్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రక్షణాత్మక రంగాలైన ఫార్మా, హెల్త్‌కేర్ వైపు మొగ్గుచూపారు. దీంతో ఆ రంగాల షేర్లలో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది.

అయితే, బ్రాడర్ మార్కెట్‌లో మాత్రం అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.26 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలపై వాటి ప్రభావం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 23,700 వద్ద తక్షణ నిరోధం ఉందని, 23,300 వద్ద బలమైన మద్దతు ఉందని తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితి తగ్గే వరకు మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగవచ్చని, కాబట్టి రిస్క్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.

## ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లిన

# సన్‌రైజర్స్...

**చెపాక్‌లో సీఎస్కే జట్టుకు చెక్**

**చెన్నైపై 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం**

**ఈ విజయంతో అధికారికంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన ఎస్ఆర్ హెచ్**

**ఇషాన్ కిషన్ (70), క్లాసెన్ (47) అద్భుత ఇన్నింగ్స్‌లతో జట్టుకు విజయం**

**ఓటమితో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు క్లిష్టతరం**

**పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో మూడో స్థానానికి చేరిన హైదరాబాద్**

**నేటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ బెర్తు కూడా ఖరారు**





**చెన్నై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత ప్రదర్శనతో ప్లేఆఫ్స్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకుంది. సోమవారం నాడు చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్‌ల అద్భుత బ్యాటింగ్‌తో ఆరెంజ్ ఆర్మీ మరో ఓవర్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. మరోవైపు, నేటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్ టైటాన్స్ కూడా ప్లేఆఫ్ బెర్తును ఖరారు చేసుకోవడం విశేషం.

181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ట్రావిస్ హెడ్ (6), అభిషేక్ శర్మ (26) త్వరగా వెనుదిరిగారు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) భారీ షాట్లతో చెలరేగారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 75 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను చెన్నై నుంచి లాగేసుకున్నారు. చివర్లో నితీశ్ రెడ్డి (11), సలీల్ అరోరా (10లి) తమ వంతు పరుగులు చేయడంతో సన్‌రైజర్స్ 19 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. అంతకుముందు, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 32) రాణించగా, ఆరంభంలో సంజూ శాంసన్ (13 బంతుల్లో 27) మెరుపులు మెరిపించాడు. అయితే, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 వికెట్లు) తన అద్భుత బౌలింగ్‌తో చెన్నైని కట్టడి చేశాడు. అతనికి షకీబ్ హుస్సేన్ (2 వికెట్లు) చక్కటి సహకారం అందించాడు.


### గుజరాత్ కూడా..!

ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి, 16 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. తద్వారా ప్లే ఆఫ్ బెర్తును ఖాయం చేసుకుంది. అదే సమయంలో, 13 మ్యాచ్ లలో 8 విజయాలతో ఉన్న గుజరాత్ టైటాన్స్ బెర్తు కూడా ఖరారైంది.

మరోవైపు, ఈ ఓటమితో చెన్నై ప్రయాణం కష్టాల్లో పడింది. 13 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో 12 పాయింట్లు మాత్రమే సాధించి ఆరో స్థానంలో నిలిచింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలవడంతో పాటు, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన క్లిష్ట పరిస్థితిలో సీఎస్కే చిక్కుకుంది.

## 'ప్లీజ్.. ఫిట్‌గా ఉన్నా ఆడొద్దు'..

**ధోనీకి గవాస్కర్ అభ్యర్థన..!**



**న్యూఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌పై కన్నేసిన చెన్నై సూపర్ కింగ్స్ కీలక మ్యాచ్ ఆడనుంది. సొంతగడ్డపై లీగ్ దశ చివరి మ్యాచ్ ఆడుతున్న సీఎస్కే విజయంతో ముందంజ వేయాలనుకుంటోంది. సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడిస్తే చెన్నై ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగపడే అవకాశముంది. ఈ నేపథ్యంలో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ మైదానంలోకి దిగుతాడనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. సునీల్ గవాస్కర్ మాత్రం 'ప్లీజ్.. ఫిట్‌గా ఉన్నా ఆడొద్దు' అని ధోనీకి సలహా ఇస్తున్నాడు.

కాలిపిక్క కండరాల సమస్యతో బాధ పడుతున్న ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఒక్క మ్యాచూ ఆడలేదు. సీజన్ ఆరంభానికి ముందే బ్యాటందుకుని ప్రాక్టీస్ చేసిన మహీ భాయ్.. నెట్స్‌లో కనిపిస్తున్నా తుది జట్టులో ఉండడం లేదు. చెపాక్‌లో సోమవారం సీఎస్కే ఆఖరి మ్యాచ్ ఆడుతున్నందున ధోనీ ఆడే అవకాశముందని సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఈ సందర్భంగా 'నా చివరి టీ20 మ్యాచ్ చెపాక్‌లోనే ఆడుతాను'అని ధోనీ ఇదివరకూ పేర్కొన్న విషయాన్ని పలువురు ప్రస్తావిస్తున్నారు. కానీ, సునీల్ గవాస్కర్ మాత్రం ధోనీని ఆడొద్దని కోరుతున్నాడు.

స్టార్ స్పోర్ట్స్ 'క్రికెట్ లైవ్'లో మాట్లాడుతూ.. 'ప్లే ఆఫ్స్ బెర్తులో చెన్నైకి కీలకమైన మ్యాచ్ ఇది. ఈ మ్యాచ్‌లో ధోనీని ఆడించడం పెద్ద పొరపాటు అవుతుంది. అతడు తుది జట్టులో ఉంటే నేనైతే ఆశ్చర్యపోతాను. ఎందుకంటే.. అతడు గాయం కారణంగా సీజన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఏడాది పైగా మైదానంలోకి ఆడింది లేదు. కాబట్టి.. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ధోనీ ఫిట్‌గా ఉన్నా సరే తీసుకోవద్దు. ఒకవేళ తీసుకుంటే బ్యాటింగ్ ఆర్డర్ దెబ్బతింటుంది' అని సన్నీ అభిప్రాయపడ్డాడు.

ఈఎస్పీఎన్ క్రిక్ఇన్ఫో కథనం ప్రకారం సన్‌రైజర్స్‌తో మ్యాచ్ కోసం ఆదివారం ధోనీ చెపాక్‌లో 30 -40 నిమిషాలు గట్టిగా సాధన చేశాడు. నెట్స్‌లో మహీ స్పిన్నర్లను ఎదుర్కొన్నాడు. దాంతో.. ఆరెంజ్ ఆర్మీపై తాల ఆడుతాడనే వార్తలు జోరందుకున్నాయి. పంతొమ్మిదో సీజన్ కోసం ధోనీని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రూ.4 కోట్లకు చెన్నై అట్టిపెట్టుకుంది. ఇప్పటివరకూ 278 మ్యాచుల్లో 137.45 స్ట్రయిక్ రేటుతో 5,439 పరుగులు సాధించాడు. ఇందులో 24 అర్ధ శతకాలు ఉండగా.. 84 నాటౌట్.

## ఆగస్టులో శ్రీలంకకు టీమిండియా..



**టీ20 సిరీస్‌పై స్పష్టత వచ్చేనా..!**

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా భారత జట్టు ఆగస్టులో శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. లంక గడ్డపై రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది టీమిండియా. ఆగస్టు రెండో వారం నుంచి ఇరుజట్లు తలపడుతాయని సమాచారం. అయితే.. ఇప్పటివరకూ శ్రీలంక క్రికెట్ షెడ్యూల్‌ను ప్రకటించలేదు. మొత్తంఅ రెండు వారాల్లో సిరీస్ నిర్వహించాలని లంక భావిస్తోంది. ఆగస్టు 15 నుంచి 27 మధ్య మ్యాచ్‌లు ఉంటాయని క్రిక్‌బజ్‌తో బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ వెల్లడించాయి. లంక ప్రీమియర్ లీగ్ అనంతరం భారత్, లంక మధ్య సిరీస్ జరుగనుంది. ఎల్‌పీఎల్ ఆగస్టు 9న ముగియనుంది. అంటే.. ఆగస్టు 15 నుంచి టెస్టు సిరీస్ షురూ కానుంది. అలానే ఇరుజట్ల మధ్య పొట్టి సిరీస్‌పై కూడా స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. అవినీతిమయమైన లంక బోర్డును ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే రద్దు చేశారు. ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ బాధ్యతలు చూసుకుంటోంది. దాంతో.. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఈమధ్యే ఐసీసీ ప్రతినిధిగా లంకకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించాడు. ఈ క్రమంలోనే నిరుడు దిత్వా తుఫాన్ బాధితుల కోసం నిధుల సమీకరణకు భారత్, శ్రీలంక మధ్య మూడు టీ20ల సిరీస్‌పై చర్చించినట్టు సమాచారం.

### జూన్ 6 నుంచి

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ మే 31న ముగియడంతో.. జూన్ 6న భారత జట్టు అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ముల్లన్‌పూర్‌లో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టులో ఆపై.. మూడు వన్డేల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సేన తలపడనుంది. అనంతరం ఐర్లాండ్, ఇంగ్లండ్, జింబాబ్వే పర్యటనల అనంతరం శ్రీలంకకు టీమిండియా వెళ్లనుంది.

## బీసీసీఐ ప్రభుత్వ సంస్థ కాదు..

# ఆర్టీఐ కిందకు రాదు..!




**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే సంపన్న బోర్డైన భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రభుత్వ సంస్థనా?, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థనా? అనే సందిగ్ధతకు తెరపడింది. 2018 నుంచి కోర్టులో నలుగుతున్న ఈ అంశంపై స్పష్టతనిస్తూ.. బీసీసీఐ ప్రభుత్వం సంస్థ కాదని సోమవారం కేంద్ర సమాచార కమిషన్ కుండబద్ధలు కొట్టింది. సమాచార హక్కు చట్టం కింద బీసీసీఐ విధివిధానాలు, పనితీరును వివరించాలని కోరుతూ దాఖలైన అప్పీల్‌కు బదులిస్తూ బీసీసీఐ ప్రభుత్వ సంస్థ కాదని సీఐసీ వెల్లడించింది. అంతేకాదు ప్రభుత్వానికి బీసీసీఐపై ఎలాంటి అధికారాలు లేవని పేర్కొంది.

బీసీసీఐ ప్రభుత్వ సంస్థ అని, ప్రభుత్వ సమాచార అధికారిని నిమమించాలనే 2018 నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఆర్టీఐ చట్టం ప్రకారం బీసీసీఐ ప్రభుత్వ సంస్థ అని, పీఆర్ఓను నియమించాల్సిందేనని సమాచార కమిషన్ మాజీ చైర్మన్ ఎం శ్రీధర్ ఆచార్యులుపట్టుబట్టారు. దాంతో, బీసీసీఐ ఆలస్యం చేయకుండా మద్రాస్ హై కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు నియయాలను పాటిస్తూ కొత్తగా విచారణ చేపట్టాలని కేంద్ర సమాచార కమిషన్‌ను మద్రాస్ ధర్మాసనం కోరింది.

ఈనేపథ్యంలోనే భారత్‌కు బీసీసీఐ ఏ విధంగా ప్రాతినిధ్యం వహిస్తుంది? జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు ఆటగాళ్లను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తుంది? వంటి వివరాలు కోరుతూ దాఖలైన అప్పీల్‌ను సోమవారం సమాచార కమిషన్ కొట్టిపారేసింది. అందుకు కారణాలు కమిషనర్ పీఆర్ రమేశ్ తన ఉత్తర్వుల్లో వివరించారు. ప్రభుత్వం బీసీసీఐకి యజమాని కాదు, ఆ సంస్థను నియంత్రించడం లేదు, ప్రోత్సహకాలు ఇవ్వడం లేదు, ఆర్థిక సాయం చేయడం లేదు అని ఆయన వెల్లడించారు.

బీసీసీఐ అనేది స్వయంప్రతిపత్తి గత సంస్థ. తమిళనాడు సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద బీసీసీఐ రిజిష్టరైంది. రాజ్యాంగం ప్రకారం, పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం ద్వారా లేదా ప్రభుత్వ ప్రకటన ద్వారా ఈ సంస్థ ఏర్పడలేదు. కాబట్టి ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 2కింద నమోదు చేయడానికి అవసరమైన చట్టపరమైన అర్హతలు బీసీసీఐకి లేవని కమిషన్ తేల్చింది. అందుకనే భారత బోర్డును ప్రభుత్వ సంస్థగా పరిగణించలేం అని కమిషనర్ పీఆర్ రమేశ్ వివరించారు.

MOVIE TIME



# అప్పుడు ఇష్టం లేనిది.. ఇప్పుడు అలవాటైంది..

### వైరల్‌గా మారిన కీర్తి సురేశ్ కామెంట్స్

టాకీస్: తొలినాళ్లలో కాస్తంత బొద్దుగా కనిపించిన కీర్తి సురేశ్, ఉన్నట్టుండి బాగా తగ్గింది. తను అనూహ్యంగా బరువు తగ్గి కనిపించడంతో ఆపరేషన్లు గట్రా చేయించుకుందంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడారు. సోషల్ మీడియాలో విమర్శలు కూడా ఎదురయ్యాయి. వీటిపై తాజాగా స్పందించింది కీర్తి సురేశ్. 'ఇప్పటివరకూ నా ఫిట్‌నెస్ గురించి ఎవరితో మాట్లాడలేదు. మొదట్లో జిమ్ అనేది నాకు సంబంధించింది కాదు, నా శరీరానికి వ్యాయామం అవసరం లేదు అనే ధోరణిలో ఉండేదాన్ని. కానీ 'మహానటి' తర్వాత వచ్చిన గ్యాప్, నా గురించి నేను ఆలోచించుకునే అవకాశాన్నిచ్చింది. వర్కవుట్లు మొదలుపెట్టి కేవలం 9 నెలల్లో పది కేజీలు తగ్గాను. లావుగా ఉంటానంటూ నన్ను బాడీ షేమింగ్ చేసినవారందరికీ సరైన సమాధానం ఇచ్చాను. ఒకప్పుడు జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఇప్పుడు జిమ్ చేయకపోతే ఏదోలా ఉంటుంది. ఇది అలవాటుగా మారడం బావుంది. ఒకప్పుడు చీరలోనే అందంగా ఉండేదాన్ని. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలొస్తున్నాయ్' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.

### 3గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం



టాకీస్: రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం. దీంతో పాటు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్, సెన్సార్ టాక్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం.

## 'సావిత్రి' ఆటనే మార్చేస్తుందట..

### ది రెడ్ బ్యాగ్ టీంలో జాయిన్ అయిన రాశీ




టాకీస్: రవికుమార్ సీరపు దర్శకత్వంలో యాక్ష న్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'(ప్రస్త్రవ=వస దీుఃస్త్రు). హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీలో పాపులర్ నటి రాశీ కీలక పాత్రలో నటిస్తుంది. ఈ విషయాన్ని షేర్ చేస్తూ మేకర్స్ షేర్ చేసిన కొత్త అప్‌డేట్ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. రాశీ టీంలో జాయిన్ అయినట్టు తెలియజేస్తూ.. కొన్ని పాత్రలు కేవలం కథకు సపోర్ట్‌గా నిలుస్తాయి. కానీ సావిత్రి మాత్రం మొత్తం ఆటనే మార్చేస్తుంది.. అంటూ నయా అప్‌డేట్ షేర్ చేశారు మేకర్స్. సావిత్రి పాత్ర సినిమాకు బ్యాక్ బోన్‌గా ఉండబోతున్నట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది. రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ఈ మూవీలో ప్రసాద్ బెహరా ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ది రెడ్ బ్యాగ్ మూవీ ప్రీ లుక్‌లో నలుగురు అమ్మాయిలతో రిలీజ్ చేసిన పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో సాగే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చారు. మరో పోస్టర్‌లో చేతినిండా రక్తం, ఆ బ్యాగును పట్టుకున్న తీరు, అక్కడే ఉన్న కత్తులు, తుపాకులు, రక్తపుమయంగా మారిన ఏరియా ఇలా ప్రతీ ఒక్కటి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. రవికుమార్ సీరపు ది రెడ్ బ్యాగ్‌కు దర్శకత్వం వహిస్తుండటమే కాకుండా కథ, కథనం సమకూరుస్తున్నాడు. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్ బ్యాగులో ఏముంది.. అనేది టీజర్‌తో ఏమైనా హింట్ ఇస్తారేమో చూడాలి.

## కొరటాల, బాలయ్య కాంబో

### ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్





టాకీస్: టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది. దేవర తర్వాత కొరటాల తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో కథ విషయంలో ఆయన చాలా సమయం తీసుకుని కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

## శివకార్తికేయన్, కమల్ హాసన్ సినిమా షురూ..

### హైప్ పెంచుతోన్న లుక్



**టాకీస్:** తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న కోలీవుడ్ స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు శివ కార్తికేయన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ అదిరిపోయే న్యూస్‌తో అభిమానుల ముందుకొచ్చాడు. ఈ సారి ఏకంగా ఉలగనాయగన్ కమల్ హాసన్‌తో సినిమా చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. శివకార్తికేయన్ నటిస్తోన్న తాజా చిత్రం ౫వఎశీఅ.

శివకుమార్ మురుగేశన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం లార్డ్‌మురుగన్ మైథాలజీ బ్యాక్ డ్రాప్ కథ స్ఫూర్తిగా రానుంది. నుదుట పసుపు బొట్టు, మధ్యలో కుంకుమ తిలకం, మెడలో రుద్రాక్ష, బంతిపూల దండతో కనిపిస్తున్న శివకార్తికేయన్ ఓ చేతిలో కాగడా, మరో చేతిలో గంటను పట్టుకున్న లుక్స్ ఇప్పటికే సినిమాపై హైప్ పెంచుతున్నాయి. ఈ మూవీ షూటింగ్ నేడు మొదలైంది.

ప్రస్తుతం చెన్నైలో ఈ మూవీ మొదటి షెడ్యూల్ కొనసాగుతుంది. దీని తర్వాత శివకార్తికేయన్ టీం నెక్స్ట్ షెడ్యూల్ కోసం పలు లొకేషన్లకు వెళ్లనుంది. ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలా శరవణన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

## టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

### కారణాలను వెల్లడించిన హీరో యశ్




**టాకీస్:** యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ సినిమాను ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం.

## ప్రేక్షకులకు వినోదాన్ని పంచాలన్నదే లక్ష్యం..




**టాకీస్:** ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనుక ఓ ఆడది ఉంటుంది. స్వేచ్ఛ కోసం భర్త చేసే అలుపెరుగని పోరాటం.. అంటూ పురుష : సినిమాతో సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాడు పవన్ కళ్యాణ్. వీరు ఉలవల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీతో పవన్‌కళ్యాణ్ హీరోగా డెబ్యూ ఇస్తున్నాడు. సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఈ చిత్రం మే 22న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా విశేషాలు షేర్ చేసుకున్నాడు పవన్ కల్యాణ్. నన్ను హీరో చేయాలన్నది మా నాన్న కల. అయితే మా కాలేజీలో సినిమా ఈవెంట్లు జరుగుతుండేవి. నాక్కూడా సినిమాలంటే చాలా ఇష్టం. మా నాన్నకు కూడా నన్ను హీరో చేయాలనే ఆశ ఉండటంతో ఇటు వైపు వచ్చానన్నాడు. సత్యానంద్ దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నా. సార్ ఉండే కమ్యూనిటీలోనే నేను కూడా ఉన్నా. 4 నెలలు ఆయనతో ఉన్నా. సత్యానంద్ శిక్షణ మాత్రమే ఇస్తారు. ఎలాంటి రిఫరెన్సులు చేయరు. ఆయన వద్ద నేను ఎంతో నేర్చుకున్నానన్నాడు పవన్ కల్యాణ్.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.